


తమ్ముడి చేతిలోని కవరు చూసి "ఎక్కణ్ణుంచిరా కోటయ్యా ఉత్తరం?" అని అడిగింది రంగనాయకమ్మ.

"కవరుపైన సౌదామిని పేరే రాసి ఉంది. ఎవరో సినిమా వాళ్ళే పంపి ఉంటారు."

సంతోషంతో రంగనాయకమ్మ ముఖం వాటంతలుంది. కూతురి వంకచూస్తూ "అయితే ఏదో సినిమాలో నీకు బుకింగు వచ్చిందన్న మాటేనేవ్! మద్రాసులో ఇంత కాలం మనం ఓపిక పట్టి ఉన్నందుకు వృధా కాలేదు".

సౌదామిని నవ్వుతూ, "పూహాల్ని గుర్రాల్లాగ పరిగెత్తనీయకపుడే! కవరు చించి అదేమిటో చూడనీ మావయ్యని!" అంది.

కోటయ్య, "ప్రియమైన నాన్నగారికి, నమస్కారములు—" అని చదివి, "ఇదేమిటే 'నాన్నగారికి' అని ఉంది?" అని ఆశ్చర్యంతో ఆగిపోయాడు.

"పోస్టువాడు ఎవరి ఉత్తరమో పొరబాటున మనకిచ్చిపోయినట్టున్నాడు." అంది సౌదామిని.

కోటయ్య కవరు మీది ఎడ్రెస్సు, ఓసారి పరిశీలించాడు. "పోస్టుమాన్ పొరబాటేం లేదు. 'మిస్ కె. సౌదామిని' అని స్పష్టంగా ఉంది. మన ఇంటి నంబరూ, చిరునామా కరక్టుగానే ఉంది."

సౌదామిని కూడా చూసి, "అవును. చిత్రంగానే ఉంది." అంది.

"చిత్రానికేముందిలే. ఆరాసినాయన, ఎవరో తన తండ్రికి కూడా ఒకజాబు రాసి నీ ఎడ్రెసు రాసిన కవరులో ఆ ఉత్తరం పొరబాటున పెట్టేసి ఉంటాడు." అంది రంగనాయకమ్మ.

"ఉత్తరాలు తారుమారయాయన్న మాట" అన్నాడు కోటయ్య.

"ఐతే ఆయనెవరో తండ్రికి రాసుకున్న ఉత్తరం మనం చదవడమెందుకు?" అంది సౌదామిని.

"కవరు చింపడమైందిగా, చదవనీ!" అంది రంగనాయకమ్మ. కోటయ్య ఛదివేడు "ప్రియమైన నాన్నగార్కి నమస్కారములు. నా ఉత్తరానికి మీరు సమాధానం కూడా రాయడం మానేశారు. సినిమాల్లో చేరదామన్న సరదాకొద్దీ నేను మీతో చెప్పకుండా వచ్చేసినంత మాత్రాన మీకు నామీద ఇంత కోపం వస్తుందనుకోలేదు. నాకు ఈ కళపైన ఉండే అభిరుచిని మీరు అభినందించడానికి బదులు కోపగించారు. దానికేం లెండి., ఎవరి అభిప్రాయాలువారివి.. నేను ప్రస్తుతం రాయబోయేదేమిటంటే ఇక్కడికి వచ్చినప్పటినుంచీ నాకు సౌదామిని' అనే ఒక అభినేత్రితో పరిచయం, కలిగింది—"

ఆ ఉత్తరంలో తన ప్రసక్తి విని సౌదామిని నిర్ఘాంత పోయినది. "నాతోపరిచయం అంటాడేమిటి?"

కోటయ్య చదవడం సాగించాడు:"ఈ అమ్మాయిలో గొప్ప తార అయ్యే లక్షణా లన్నీ కనబడుతున్నాయి—"

ఆ ప్రశంసా వాక్యాన్ని వినడంతోనే రంగనాయకమ్మ, "నేను చెప్పేనుగా! నీకింకా ఛాన్సంటూ రాలేదుకాని, వస్తే పేరు సంపాదించడ మెంతసేపు?" అంది.

కోటయ్య తర్వాత వాక్యం చదివేడు. "ఈ సౌదామినిని పెళ్ళిచేసుకోవాలన్న దృఢ సంకల్పం నాకు కలిగింది."

సౌదామిని తెల్లబోయింది. "ఆ!ఏమిటీ? పెళ్ళా?" రంగనాయకమ్మ కూడా చెవులు రిక్కించుకు వినింది. కోటయ్య చదవడం పూర్తి చేశాడు. "నేను సినిమాలో చేరడానికి ఇష్టంలేనిమీకు ఈ వర్ణాంతర వివాహం అసలే రుచించదని నాకు తెలుసు. మీ యాభై ఎకరాల పొలంలో ఒక్క సెంటుఐనా నాకు ముట్టదని కూడా తెలుసు. నాకు మీ భూమి అక్కర్లేదు. మా దాంపత్యానికి మీరు అడ్డురాకుండా ఉంటే చాలు......ఇట్లు మీకుమారుడు, చలపతిరావు."

సౌదామిని, "ఇదంతా రాస్త చలపతి రావుగారా?" అంది తికమక పడుతూ.

కోటయ్య, "అవును....ఐతే ఈ చలపతిరావుతో నీ పరిచయం పెళ్ళిదాకా వచ్చిందన్నమాట! చెప్పేవేకాదూ!" అన్నాడు నవ్వుతూ.

సౌదామినికి కోపం వచ్చింది. "చెప్పడానికి ఏమైనా ఉంటేగదా. నిన్న ఆయన బస్సు స్టాండులో కనబడి, 'నమస్తే' అంటే 'నమస్తే' అనుకున్నాం. "మీకెక్కడైనా బుక్కింగు దొరికిందా?"అని అడిగాను మాట వరసకి. ఆయన 'లేదండీ. మీకేమైనా ఛాన్సు వచ్చిందా?' అన్నాడు. 'లేదు. ఐతే మన యిద్దరి అదృష్టం ఒకలాగే ఉందన్న మాట. తెచ్చుకున్న డబ్బు కూడా ఐపోతోంది. పోదాం పదవే అంటే మా అమ్మకింకా ఆశ వదల్లేదు.' అన్నాను. అప్పుడాయన, 'నాకూ ఇబ్బందిగానే ఉందండి డబ్బుకి' అని ఓ నిమిషం పూరుకుని, 'సౌదామినిగారూ, మీతో ఒక సంగతి చెబుదామనుకుంటున్నానండీ.' అని ముసిముసి నవ్వుతూ ఏదో చెప్పబోయాడు."

రంగనాయకమ్మ "ఇంకనేం? దాని అర్థం అదే!' అంది అంతా తెలిసిపోయినట్లు.

సౌదామినికి వళ్ళు మండింది. "ఏమిటమ్మా ఆ అర్థం? నా నోట్లోంచి ఏమీ రాకుండానే అల్లుకుపోతావేం?" అంది.

కోటయ్య నవ్వుతూ "కోపమెందుకు సౌదామినీ? చలపతిరావు ఏమన్నదీ చెప్పు" అన్నాడు.

"ఏమి అనడానికీ ఏదీ? ఇంతలో నాకు బస్సు వచ్చేసింది. 'మీరు వెళ్ళండి. నేను చెప్పదలచిందంతా ఒక ఉత్తరంలో రాసి పోస్టు చేస్తాను. అప్పుడు మీకే బోధపడుతుంది' అన్నాడాయన. నా దార్న నేను బస్సులో వచ్చేశాను."

రంగనాయకమ్మ అందుకుని, "ఇంటికి పోయి చలపతిరావు రాసిన ఉత్తరాలు తారుమారై నీకాతడు రాసిన ప్రేమలేఖ తండ్రికి పోయిందన్న మాట!" అంది.

"ఆ లవ్ లెటరు చూసి ఆ తండ్రి ఏమనుకుంటాడో?" అన్నాడు కోటయ్య.

"ఆ! ఏమనుకుంటాడులే! ఓ విధంగా ఆ లవ్ లెటరు ఆయన చేతిలో పడడమే మంచిదనిపిస్తోంది నామటుక్కి." అంది రంగనాయకమ్మ.

"ఎందుచేత?" అంది సౌదామిని.

"ఎందుచేత నేమిటి? తన కొడుకు నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నదీ ఆ ఉత్తరం ద్వారా తెలుసుకున్నప్పుడు ఆయన మనస్సు కరిగిపోతుంది. మొదట కోపం వచ్చినా, తరవాత మీ పెళ్ళికి ఒప్పుకోక పోడు."

"కొడుకు సినిమాలో చేరడానికి ఒప్పు

హారిరామ్



కోని తండ్రి వర్ణాంతర వివాహానికి ఒప్పు కుంటాడూ?" అంది సౌదామిని.

"ఒకవేళ ఆ తండ్రి ఒప్పుకోక పోయినా ఈ ఉత్తరాన్ని బట్టి చూస్తే చలపతి మాత్రం నిన్ను తప్పకుండా పెళ్ళి చేసు కుంటాడనే నాకనిపిస్తోంది."

కోటయ్య కలుగజేసుకుని, "తండ్రి ఆస్తిలో సెంటు భూమి కూడా రాకపోతే, ఈ పెళ్ళి ఐ మాత్రం ఏమిటి లాభం అక్కా?" అన్నాడు.

"భూమి ఎందుకు రాదురా?" అంది రంగనాయకమ్మ. "ఇవ్వనని మొదట భీష్మిం చుకు కూచున్నా ఏ తండ్రికైనా క్రమంగా కోపం అదే చల్లారి పోతుంది. ఏమైనా కొడుకు కొడుకే కదా! ఆస్తిని కొడుక్కి ఇవ్వక ఏం చేసుకుంటాడు?"

సౌదామినికి నవ్వు వచ్చింది. "ఐతే ఇంక ఈ పెళ్ళి నిశ్చయమై పోయినట్టే నన్న మాట!"

"కాక మరి?"

"నా ఇష్టాయిష్టాలతో ప్రమేయమేమీ లేదా ఐతే?" అంది సౌదామిని నవ్వుతూనే.

"నీకిష్టం లేకపోవడమేమిటే పిచ్చిపిల్లా!" అంటూ లేచింది రంగనాయకమ్మ. "సిరి వచ్చి పడుతూంటే మోకాలు అడ్డ తారుటే? ఇలాంటి వెర్రి వూహలకి పోయి ఏమాత్రం వెనకతీసినా చేజిక్కిన బంగారు పిచిక కాస్తా ఎగిరి పోతుంది ఏమను కున్నావో?"

*

చలపతి పోస్టు చేసిన రెండో కవరు బళ్ళారిలో ఉన్న అతని తండ్రి భానోజీ రావు పంతులుకా మర్నాడు అందింది. ఆయన ఉత్తరాన్ని చదువుకోవడం పూర్తి చేసిన క్షణానికి భార్య రుక్మిణమ్మ ప్రవేశించి, "మన వాడి దగ్గర్నుంచేనా?" అని అడిగింది.

"అవును మనవాడి దగ్గర్నుంచే. మనకి మాత్రం కాదు."

"ఎవరికి రాశాడు మరి?"

"ఎవరో సౌదామినిట. సినిమాపిల్ల".

"సినిమా పిల్లా? దానికెందుకు రాశాడండీ మన నాయన?"

"ఎందుకో విను." అంటూ పంతులు చదివేడు. 'కుమారి సౌదామినిగారికి—ఈ ఉదయం బస్సుస్టాండులో మీతో చెబుదా మనుకున్న సంగతే రాస్తున్నాను. నేను కూడా మీ లాగే సినిమాలో చేరాలని వచ్చి అవకాశం దొరక్క భంగపడ్డాను. కదా. ప్రస్తుతం డబ్బు లేక చిక్కుగా ఉంది. మానాన్న గారికి రాస్తే నామీది కోపం కొద్దీ ఒక్క చిల్లి గవ్వకూడా పంపనన్నారు—"

రుక్మిణమ్మ అడ్డువచ్చి, "అయ్యోపాపం వాడేం ఇబ్బంది పడుతున్నాడో, సొమ్ము పంపకూడదుటండీ?" అంది.

భానోజీరావు పంతులు, "చివరిదాకా విను." అంటూ మళ్ళీ చదవడం మొదలు పెట్టేడు.

"ఆయన వద్దనుంచి సొమ్ము రాబట్ట డానికి ఒక ఎత్తు వేశాను. బస్సు స్టాండులో మిమ్మల్ని చూసినప్పుడే మెరుపు లాగ ఈ ఆలోచన తట్టింది. నేను మిమ్మల్ని వివాహం చేసుకుంటున్నానని మా నాన్నకి ఇప్పుడే ఒక జాబురాశాను. ఆజాబు చూసుకోవడంతోనే ఆయన నేను నిజంగా కుల భ్రష్టుడిని ఐపోతా నన్న భయం కొద్దీ మీవద్దకి పరుగెత్తు కొస్తాడు మీరు నన్ను పెళ్ళి చేసుకో కుండా వదిలేస్తే ఎంత సొమ్మైనా మీకిచ్చుకుంటానని ప్రాధేయ పడతాడు. రెండు వేలో, మూడు వేలో—,ఎంతరాబట్ట గలిగితే అంతా ఆయనవద్ద రాబట్టండి. అందులో సగం మీకూ, సగం నాకూను —

పి. చలపతిరావు"

"డబ్బులేక ఇబ్బంది పడేవాళ్ళకి ఎటువంటి దుర్బుద్ధులైనా పుడతాయి." అని నిట్టూర్చింది రుక్మిణమ్మ.

భానోజీరావు పంతులు "అందరికీ పుడ తాయా?" అన్నాడు కోపంగా. "సుపుత్రా కొంప కీకరా! అన్నట్టు ఇలాంటి ప్రబు ద్ధులకే పుడతాయి! నన్ను బోల్తాకొట్టి ద్దామనుకున్నాడు చవట నాగమ్మ!"

"ఎందుకంటే వాడివిూదంత కసి? సంగతి తెలిసింది కనుక వాడికి డబ్బు పంపిం చండి." అంది రుక్మిణమ్మ అనునయంగా.


ఆయన వెటకారంగా "పంపడమెందుకూ? స్వయంగానే పట్టుకెళ్ళి ఇస్తాను" అన్నాడు.

* * *

ఆ మరునాడే ఆయన మద్రాసు చేరు కున్నాడు. పాండీ బజారులో కాఫీహోటళ్ళు వద్ద చేరిన సినిమావాళ్ళను వాకబు చేయగా, "సౌదామిని" అన్న పేరుతో తార ఎవరూ లేదే" అన్నారు వాళ్ళు.

"ఆ అమ్మాయి సినిమాలో చేరాలని వచ్చింది. ఇంకా అవకాశం దొరికినట్టు లేదు" అని కొడుకు ఉత్తరాన్ని బట్టి తెలిసిన సంగతిని వివరించాడు భానోజీరావు పంతులు.

"ఓహో, అలాగా? అమధ్య ఒక



అమ్మాయి మాయింటికి వచ్చింది సిఫారసు చేయమంటూ. పేరు 'సౌదామిని' అని చెప్పినట్లే జ్ఞాపకం." అంటూ వారిలో మ్యూజిక్ డైరెక్టరు ఒకతను ఆమె బసకు ఆనవాళ్లు చెప్పేడు.

భానోజీరావు పంతులు రంగనాయకమ్మను చూడడంతోనే పూర్వ పరిచయం ఉన్నవాడిలా ఎంతో చనువు నటిస్తూ మాట్లాడేడు. "మీ అమ్మాయికి మావాడు రాసిన ఉత్తరం తారుమారై నాకు చేరడం చాలా మంచిదే అయింది సుమండీ. ఏమంటే మా చలపతిరావుకి మీ సౌదామినిమీద ఎటువంటి అనురాగమూ, ప్రేమా ఉన్నాయో నాకు అర్థమైంది."

రంగనాయకమ్మేం తక్కువది కాదు. "మా సౌదామిని కూడా చలపతిగారిని అంతగాఢంగానూ ప్రేమించిందండీ అన్నగారూ! ఎటొచ్చీ నేనే 'వారెక్కడ? మన మెక్కడే?' అంటూ నిరుత్సాహపరచబోయాను....ఏమిరా తమ్ముడూ" అంటూ కోటయ్య వైపు తిరిగింది.

"అవును. పరిపరి విధాల చెప్పేం" అంటూ వంత పలికేడు కోటయ్య.

భానోజీ రావు పంతులు వాళ్ల మాటలు నమ్మినట్లే నటిస్తూ, "అలాగా? కాని అమ్మాయిని అలా నిరుత్సాహ పరచడం దేనికి? వాళ్లు అన్యోన్యంగా అలా, ప్రేమించుకున్నప్పుడు ఆ పవిత్ర ప్రేమకు మనం అడ్డురాకూడదు." అన్నాడు.


రంగనాయకమ్మ సంబరపడుతూ "తమ్ముడూ చూశావ్రటూ పంతులుగారెంత సంస్కార పరులోనూ. ఈ సంగతి తెలుసుకోలేక చలపతిగారు అనవసరంగా భయపడి పోయారు....అన్నయ్యగారూ, మీరు మా సంబంధానికి ఒప్పుకోరేమోనని సందేహించారండీ మీ అబ్బాయి. ఆయన మీకు రాసి పొరబాటున మాకు పంపిన ఉత్తరం చూస్తే ఆయన పడ్డ అపోహ తెలుస్తుంది" అంది.

"ఎందుకూ, నాకు ఏవిధమైన అభ్యంతరం లేదని మీ ఎదురుగానే మావాడితో చెప్పేస్తాను. వాడి బసకి వెడదాంరండి" అన్నాడు భానోజీరావు. "కోటయ్యగారూ! ఒక టాక్సీని రప్పించగలరా?"

"ఓ. అలాగేనండి" అంటూ కోటయ్య

## సౌదామిని

వెడుతూ సౌదామినితో రహస్యంగా "ఏమి అదృష్టమే నీది!" అన్నాడు. సౌదామిని మెల్లిగానే, "ఐతే మావయ్యా, అక్కడా అక్కడా చూడడం తప్ప ఎటువంటివాడో తెలియని ఈ చలపతిగారిని నేను



పెళ్ళి చేసుకోవలసిందే అంటావా?" అంది.

"ఆ! విధిగా చేసుకోవలసిందే! కల్యాణం వచ్చినా కక్కువచ్చినా ఆగదుగా మరి!"

చలపతి లాడ్జిముందు టాక్సీలోంచి ఆ నలుగురూ దిగేరు. కోటయ్యే, "చలపతి రావుగారూ," అంటూ తలుపు తట్టేడు. తలుపు తెరిచి తండ్రిని చూడడంతోనే చలపతి నిర్ఘాంతపోయాడు. భానోజీరావు పంతులు అది గమనించనట్లు అప్యాయంగా "ఏమిరా నాయనా, కులాసాగా ఉన్నావా?" అన్నాడు.

"ఆ. అమ్మ క్షేమంగా ఉందా?"

"క్షేమమేరా నాయనా....ఇంటికబుర్లన్నీ మనం తరవాత సావకాశంగా చెప్పుకోవచ్చు. మొదట నీపెళ్లి వ్యవహారం సెటిల్ చేసి ఈ పెద్దమనుష్యుల్ని పంపేద్దాం."

తండ్రి మాటలు వినడంతో చలపతి తనలో, "ఆ డబ్బేదో అక్కడే గుంజుకుని పంపెయ్యక ఈయన్ని ఇక్కడిదాకా తీసుకు వచ్చారెందుకో వీళ్లు?" అనుకున్నాడు.

భానోజీరావు, "నాయనా, ఈసౌదామినిని నువ్వు ప్రేమించావని నీ ఉత్తరం వల్ల తెలుస్తోంది. ఈ అమ్మాయి కూడా నిన్నే ప్రేమించిందని వీరంతా చెబుతున్నారు. ఏమండీ కోటయ్యగారూ, అంతేనా?"

"అంతేనండీ."

"నాకెంతో సంతోషంగా ఉందిరా అబ్బాయ్." అన్నాడు భానోజీరావుపంతులు "మీ అమ్మా నేనూ కూడా చిన్నప్పుడు ఇలాగే ఒకళ్ల నొకళ్లం ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నాం."

చలపతి తనలో "అంతా అబద్ధం, ఏదో కొంప మునుగుతోంది!" అనుకున్నాడు.

"నువ్వు కూడా అలాగే చేసుకుంటున్నందుకు నాకూ మీ అమ్మకి చాలా ఆనందంగా ఉంది. నా సలహా ఏమిటంటే పెద్దహడావిడి ఏమీ లేకుండా మీరిద్దరూ రిజిస్టర్ మారేజి చేసుకుంటే మంచిది." అన్నాడు భానోజీరావుగారు. రంగనాయకమ్మ సంతోషం వెలిబుచ్చుతూ, "అదే మంచిది అన్నగారూ, సింపులుగా తెమిలి పోతుంది. ఏమిరా కోటయ్యా?"

"అవును. బెడద లేకుండా సింపులుగా

తెమిలి పోవడమే మంచిది.'' అనేసికోటయ్య వే నగోడలిని, ''మంచి ఛాన్సు కొట్టేవే సౌదామినీ'' అని అభినందించాడు.

ఆమాటలు వినడం తోనే రంగనాయకమ్మకి సౌదామిని జాతకం జ్ఞాపకం వచ్చింది. ''ఇది చాలా అదృష్టవంతురాలని జ్యోతిష్కుడు గారు చెప్పేరుకాదూ మరి!''

కోటయ్య ఉండబట్టలేక, ''అదృష్టం లోనూ కాస్తానా అక్కా? యాభై ఎకరాలు'' అన్నాడు భానోజీరావు పంతులు''యాభయ్యే కాదు కోటయ్యగారూ, ఈ మధ్య మళ్లీ మరొక పుట్టెడు భూమికొన్నాను.''అన్నాడు. రంగనాయకమ్మ ''అలాగాండీ'' అంటూ కూతురి అదృష్టానికి మరోసారి పొంగి పోయింది. చలపతికేసి చూసి, ''ఏమండీ అల్లుడుగారూ, మీరేమీ మాట్లాడరేం?' అంది.

చలపతి మొహం తెల్ల కాగితంలాఉండడం చూసి రంగనాయకమ్మ ఆశ్చర్యపోచే, ''అదేమిటీ, అలా ఉన్నారు?''అంది. కోటయ్య, ''ఏమండీ,ఒంట్లో బావుండలేదా'' అని ప్రశ్నించాడు. ''ఏమిరా నాయనా?'' అని ఆదుర్దా నటించారు భానోజీరావుగారు.

చలపతి దుఃఖం ఆపుకుంటూ,''నాన్న గారూ, క్షమించాలి!'' అన్నాడు.

''ఏమిట్రా బాబూ, ఎందుకు?''

''నాబుద్ధి గడ్డి తింది. మిమ్మల్ని మోసం చేసి డబ్బు రాబట్టాలనుకున్నాను. ఈ నీచులతో గూడు పుఠాణి చేసి నందుకు బాగా శాస్తి ఐంది!''

రంగనాయకమ్మకేం అర్థం కాలేదు. ''గూడుపుఠాణి ఏమిటి?''

''నీచులంటాడేమిటి? ఎవర్ని?''అన్నాడు కోటయ్య.

''ఎవర్నా? మిమ్మల్నే!'' అంటూ చలపతి గద్గదస్వరంతో, ''నాన్నగారూ, వినండి. చేసిన పాపం చెప్పేస్తాను. ఈ సినిమా అమ్మాయిని పెళ్లి చేసుకుంటానంటే మీరు ఒప్పుకోరనీ, మావాణ్ణి వదిలిపెట్ట వలిసిందని మీరు వచ్చి వీళ్లని బతిమాలుతారనీ అనుకున్నాను. మీరలా వచ్చి ప్రాధేయ పడ్డప్పుడు మీదగ్గర్నుంచి డబ్బు లాగమని ఈ సౌదామినికి రాశాను. వీళ్లు నన్ను లోకువ కట్టి ఆయాభై ఎకరాలకోసం ఈ సౌదామినిని నాకు కట్టిపెట్ట డానికి సిద్ధమవుతున్నారు!'' అన్నాడు.

రంగనాయకమ్మ ఉగ్రురాలై,''నాన్సెన్స్! ఏమన్నావ్? నీ యాభై ఎకరాలకోసమూనా'' అంది.

భానోజీరావు పంతులు తాపీగా, ''యాభయ్యేకాదు రంగనాయకమ్మగారూ, మరో ఎనిమిది ఎకరాలు కూడా కొన్నానని చెప్పేనుగా.'' అన్నాడు.

''ఎనిమిదికాదు ఎనభై కొనుక్కోండి,



2354B/1 TEL

మాకెందుకు? మధ్య మేమేదో చేశామంటాడేమిటి? ఏదిరా కోటయ్యా, ఆ ఉత్తరం?" అంటూ తీసుకుని రంగనాయకమ్మ దాన్ని చలపతిముందుపడేస్తూ "ఈ ఉత్తరం రాస్త నువ్వేకదా" అని గద్దించింది.

చలపతి ఆఉత్తరం చూసి, "ఇదిమా నాన్నకి రాసిన జాబు. సౌదామినికి రాసిన ఉత్తరం చూపించండి. యధార్థం తెలుస్తుంది." అన్నాడు.

భానోజీరావుపంతులు, "అబ్బాయ్, జరిగిన సంగతి చెపుతావిను. నువ్వు సౌదామినికి రాసిన ఉత్తరం తారుమారై నాకుఅందింది. అందులో నువ్వు తలపెట్టిన గూడుపుఠాణి సంగతి తెలియక వీళ్లు అదేదో లవ్ లెటరయి ఉంటుందని ఫూహించి మన్ని ప్రేమించడం మొదలు పెట్టేరు." అని తనజేబులోంచి చలపతి సౌదామినికి రాసిన ఉత్తరాన్ని తీశాడు. "రంగనాయకమ్మగారూ, ఈ ఉత్తరం చదవండి. మావాడు మీ అమ్మాయిని ఏంతవరకూ ప్రేమించేడో తెలుస్తుంది!" అంటూ దాన్ని ఆమెకు అనదించేడు.

రంగనాయకమ్మ ఆ ఉత్తరం చదివి మండి పడుతూ, "ఏం మర్యాదస్తుడవయ్యా చలపతీ! నీతో లాలూచీ ఐ మీనాన్న దగ్గర డబ్బు లాగడానికి మేమంత చెత్తకారీ మనుషులమనుకున్నావా?....మామానాన మమ్మల్ని ఉండనివ్వక పని గట్టుకుని పిలిచి ఇలా అవమానపరుస్తారా?" అంది.

అంతా చూస్తూ ఉండిపోయినసౌదామిని కలుగ జేసుకుని, "అమ్మా, సంగతేమిటో తెలుసుకోకుండా గాలిమేడలు కడుతూ పోయినందుకు బాగా అయిందిలే మనకి శాస్తి!"అంది. ఆమె కంఠంలో కాఠిన్యం ఏర్పడింది. కోపంతో ముఖం ఎర్రబడింది "చలపతిరావుగారూ, మీరు మమ్మల్ని 'నీచులు' అని కదూ అన్నారు? ఎవరు నీచులైందీ ఈ ఉత్తరంలో లిఖితపూర్వకంగా కనబడుతూనే ఉంది! కన్నతండ్రికి ఇలా ద్రోహం తలపెట్టిన మీనైచ్యం మీతో ఆగక నన్ను కూడా ఈ బురదలోకి లాగింది!" అంది.

భానోజీరావు పంతులు "శభాష్ సౌదామినీ" అని మెచ్చు'న్నాడు. "కోటినరహాలకిమ్మత్తు చేసేమాట అన్నావు! నువ్వేవంటో చవకబారు మనిషివనుకుని పొరబడ్డాను. అందుకు క్షమాపణ కోరుకుంటున్నాను.. నీ ఔచిత్యం నాలో మార్పు కలిగించింది నాకింక కులంతో పనిలేదు. మావాడికి అభ్యంతరం లేకపోతే, నిన్ను నాకోడలిగా చేసుకోవడానికి నేను అడ్డు చెప్పను."

"క్షమించాలి పంతులుగారూ! ఈనాడు తండ్రికి దగా తలపెట్టిన చలపతిగారు రేపు భార్యని బోల్తాకొట్టించడానికి వెనుదియ్యరు.....ఈయనను నేను భర్తగా అంగీకరించలేను..... అమ్మా, పద. రా మావయ్యా" అంటూ వాళ్లని తీసుకుని వెనక్కి తిరిగిచూడకుండావెళ్లిపోయింది సౌదామిని. ●


**FREE! ఉచితం!**

**అడ్డుగా నున్న పాపపు గోడ**

"రక్షింప నేరక యుండునట్లు యెహోవా హస్తము కురుచగాలేదు. విననేరక యుండునట్లు ఆయన చెవులు మందముకాలేదు. మీ దోషములు మీకును, మీ దేవునికి అడ్డముగా వచ్చెను. మీ పాపములు ఆయన ముఖమును మీకు మరగు పరచెను. కనుక ఆయన ఆలకింపకున్నాడు" యెషయా. 59—1.2.

విలువ గల పుస్తకములు ఉచితముగా పొందవలెనన్నను, బైబిల్ పరిశోధనపై చక్కని సర్టిఫికేట్ పొందగోరినను మీ చిరునామా మాకు తెల్పండి. పోస్టు ఖర్చులు మావే. **ఎస్. జాన్ డేవిడ్, వికీతుల,బాక్సు, 12, చిలకలూరి పేట, గుంటూరు జిల్లా.** A. M. G,

